పేదలకు వైద్య విద్య అందకుండా కూటమి కుట్రలు

- 37వ వార్డులో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం
- ప్రారంభించిన వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి

కల్లూరు: ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేలా కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నిందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు.. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శుక్రవారం కల్లూరు అర్బన్ 37వ వార్డు వీకర్‌సెక్షన్ కాలనీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులోకి తీసుకురావాలన్న ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలలు ప్రారంభించారన్నారు. దీంతో పేద విద్యార్థులు వైద్య విద్యను చదవడంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి పేరు వస్తుందనే అక్కసుతో సీఎం చంద్రబాబు పీపీపీ విధానాన్ని తీసుకొచ్చారని విమర్శించారు. మెడికల్ కళాశాలలు ప్రైవేటు పరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమనికి శ్రీకారం చుట్టిందని వివరించారు. పేదలు వైద్య విద్య చదువుకోవడం కూటమి నాయకులకు ఇష్టం లేదన్నారు. ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేసే విధంగా వైఎస్సార్‌సీపీ పాలనలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండేలా హెల్త్ సెంటర్లను ప్రారంభించామన్నారు. 2024 ఎన్నికల సభలలో చంద్రబాబు వైఎస్సార్‌సీపీ అందిస్తున్న పథకాలతో పాటు సూపర్ సిక్స్ పథకాలు అందిస్తామని ఊదరగొట్టారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు అవుతున్నా ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, 50 ఏళ్లకు పింఛన్ వంటి పథకాలకు మొండిచెయ్యి చూపారని ఎద్దేవా చేశారు. కూటమి పాలనలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వీధి వీధిలో బెల్ట్ షాపులు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని, కూటమి నాయకులే నకిలీ మద్యం తయారుచేసి షాపుల్లో అమ్ముతున్నారని, ప్రజారోగ్యం వారికి పట్టదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వెంకటేశ్వర్లు, సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంత రెడ్డి, నారాయణరెడ్డి, లక్ష్మిరెడ్డి, శ్రీనివాసులు, నాయకులు షరీఫ్, శివారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మాధవ స్వామి, శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

క్లుప్తంగా

ఆర్జీఎం, ఎఫ్‌ఎల్‌ఎం మధ్య ఒప్పందం


అవగాహన ఒప్పదం కుదుర్చుకుంటున్న దృశ్యం

పాణ్యం: మండలంలోని ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాల ఎంబీఏ విభాగం ఎఫ్‌ఎల్‌ఎం సంస్థ మధ్య అవగాహన ఒప్పందం కుదిరినట్లు ప్రిన్సిపాల్ జయచంద్ర ప్రసాద్ తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు పరిశ్రమ అనుభవం ప్రాజెక్టు వర్క్, ఇంటర్న్‌షిప్ తదితర అవకాశాలు ఈ ఒప్పందం కల్పిస్తుందన్నారు. పరిశ్రమ నిపుణుల ద్వారా గెస్ట్ లెక్చర్స్, వర్క్ షాప్‌లు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించబడతాయన్నారు. విద్యార్థులకు నైపుణ్యాలు పెంచి వారి భవిష్యత్తుకు పునాదులు వేయడానికి ఈ ఒప్పందం వేదికగా నిలుస్తుందన్నారు. కళాశాల డైరెక్టర్ అశోక్‌కుమార్, ఎంబీఏ హెచ్‌ఓడీ సౌజన్య పాల్గొన్నారు

సీజేఐపై దాడి అమానుషం


డీటీ శివశంకర్ రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

పాణ్యం: సుప్రీంకోర్టు సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి అమానుషమని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు గద్దల సామేల్ అన్నారు. పద్మశ్రీ, ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు మందక్రిష్ణ మాదిగ పిలుపు మేరకు జాతీయ ఎంఆర్‌పీఎస్ నాయకులు మున్నింగ నాగరాజు సూచనల మేరకు ఈ నిరసన చేపట్టామన్నారు. సుప్రీంకోర్టు సీజేఐపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాక ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికే ఇలాంటి ఘటనలు ఎదురైతే సామన్యుల పరిస్థితి ఏమిటన్నారు. అనంతరం డీటీ శివశంకర్ రెడ్డికి వినతి పత్రం అందించారు. ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు తిమ్మయ్య, వెంకటాద్రి, లక్ష్మయ్య, నాగరాజు, చిరు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను పరిష్కరించండి


సమీక్ష నిర్వహిస్తున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి

సి.బెళగల్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజలు అందించే అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ వెంకటలక్ష్మి ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం పీజీఆర్ఎస్ అర్జీలపై సమీక్ష నిర్వహించి వీఆర్‌ఓలకు, సర్వే సహాయకులకు పలు సూచనలు ఇచ్చారు. అర్జీదారులను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దన్నారు. సమీక్షలో మండల సర్వేయర్ నాగభూషణం ఉన్నారు.

సీసీ రోడ్లు నిర్మించాలి


మట్టి రోడ్డును చూపుతున్న సీపీఎం నాయకులు

కల్లూరు: కల్లూరు అర్బన్ 35వ వార్డు ఉమామహేశ్వరి నగర్‌లో సీసీ రోడ్డు నిర్మించాలని సీపీఎం నాయకులు సుధాకరప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం వార్డులోని ఉమామహేశ్వరి నగర్, ఫారుక్ నగర్ కాలనీలో సీపీఎం ప్రతినిధి బృందం పర్యటించి, ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా 35వ వార్డులోని కాలనీల్లో రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. అధికారులు స్పందించి కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలన్నారు. సీపీఎం నాయకులు రామాంజనేయులు, అయ్యప్ప, సురేష్, శ్రీనివాసులు, అక్బర్ బాష, చిట్టిబాబు, గోపీనాథ్, గంగావతి, లక్ష్మి, పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌ఆర్‌ఎంఓగా డాక్టర్ పద్మజ


డాక్టర్ వి.పద్మజ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నూతన సివిల్ సర్జన్ ఆర్ఎంఓ (సీఎస్ఆర్ఎంఓ)గా డాక్టర్ వి.పద్మజ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన డిప్యూటీ సివిల్ సర్జన్ కేడర్‌పై పదోన్నతిలో భాగంగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా పనిచేస్తున్న డాక్టర్ పి.పద్మజను పదోన్నతిపై కర్నూలుకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మెరు గైన వైద్యసేవలు అందించడమే తన ప్రధాన లక్ష్యమని, వైద్య సిబ్బంది సహకారంతో ఆసు పత్రి సేవల స్థాయిని మరింత అభివృద్ధి చేస్తాన ని తెలిపారు. ఆమెను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, వైద్యులు, అధికారులు, సిబ్బంది అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాణ్యం: పాణ్యం ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మధుసూదన్ తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో, 33 కేవీ లైన్ల మరమ్మతు పనుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు.

పీజీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు కల్చరల్: డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో 2025-26 విద్యా సంవత్సరంలో ఒక సంవత్సరం పీజీ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లోకనాథ ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీలో నాలుగు సంవత్సరాల ఆనర్స్‌తో కూడిన యూజీ డిగ్రీ, ఒక సంవత్సరం పీజీ ప్రోగ్రాం (లేటర్ ఎంట్రీ)లో బీఎస్సీ/బీకాం/బీఏ/బీబీఏ/బీసీఏ ఆనర్స్ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 25వ తేదీలోగా వర్సిటీలో దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.


తమ్మరాజుపల్లెలో నిలిచిపోయిన టిప్పర్లు

సీనరేజ్ ఎఫెక్ట్

- ఆగిన గ్రావెల్, కంకర రవాణా
- వారం రోజులుగా గ్రామానికే పరిమితమైన టిప్పర్లు
- లబోదిబోమంటున్న వినియోగదారులు

పాణ్యం: రాష్ట్ర ప్రభుత్వం మైనింగ్ శాఖలో తెచ్చిన సీనరేజ్ చార్జీల వసూళ్ల ప్రక్రియను ప్రయివేట్ సంస్థకు అప్పగించారు. అయితే టెండర్ దక్కించుకున్న కంపెనీ సీనరేజ్ చార్జీలు వసూలు చేసేందుకు మైనింగ్ ప్రదేశాల్లో కంటైనర్లు, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసింది. టన్నుల లెక్కన సీనరేజ్ వసూలు చేసేందుకు సిద్ధం కావడంతో మైనింగ్ నిర్వాహకులు, టిప్పర్ల యజమానులు హడలిపోతున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం టన్ను గ్రావెల్‌కు రూ.90, కంకర టన్నుకు రూ.150 వరకు చెల్లించాలని సూచించినట్లు సమాచారం. ఇలా ప్రతి టిప్పునకు చెల్లించాల్సి ఉంటుంది. గ్రామంలో దాదాపు 70కి పైగా టిప్పర్లు ఉన్నాయి. ఒక టిప్పరు రోజుకు నంద్యాలకు 3-4 లోడ్‌ల గ్రావెల్, కంకరను తరలిస్తాయి. వారం రోజులుగా సీనరేజ్ వసూళ్లకు చర్యలు చేపట్టడంతో టిప్పర్లు నిలిచిపోయాయి.

దెబ్బతింటున్న రవాణా

గ్రామంలో మైనింగ్ వనరులు పుష్కలంగా ఉన్నాయి. రోజూ 70కిపైగా టిప్పర్లలో కంకర, గ్రావెల్, కంకర ముడి సరుకు రవాణా జరిగేది. ఇలా రోజు 200 టిప్పర్లకుపైగా ముడి సరుకు బయటకు వెళ్లేది. అయితే వీటిపై డ్రైవర్లు, ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులు, డీజిల్ పంపులు, మెకానిక్ దుకాణాలు, ఇలా దాదాపుగా 150-200 పైగా కుటుంబాలు ఆధారపడి జీవించేవారు. అయితే వారం రోజులుగా సీనరేజ్ వసూళ్ల వల్ల టిప్పర్లను స్టార్ట్ చెయ్యడం లేదు. దీంతో తమ బతుకు చక్రం ఆగిందని టిప్పర్ల యజమానులు వాపోతున్నారు.

వినియోగదారులపైనే భారం

నిర్మాణ రంగానికి కావాల్సిన ముడి సరుకులను తమ్మరాజుపల్లె నుంచి నంద్యాల, మహానంది, వెలుగోడు, ఓర్వకల్లు, బండిఆత్మకూరు మండలాలకు సరఫరా చేసేవారు. వ్యత్యాసాన్ని బట్టి బాడుగ వసూలు చేసేవారు. తమ్మరాజుపల్లె నుంచి నంద్యాలకు గ్రావెల్ రూ.5000- రూ.5500లకు తీసుకెళ్లేవారు. కంకర టిప్పరు రూ.24 వేలు పలికేది. ప్రస్తుత పరిస్థితిలో సీనరేజ్ కలిపితే టిప్పర్‌కు గ్రావెల్ 20 టన్నుల లోడ్ చేస్తే సినరేజ్ కింద రూ.1800 కలుపుకొని మొత్తం రూ.7300 వినియోగదారులపై భారం పడుతుంది. ఇక కంకర కావాలంటే టిప్పర్ రూ.30 వేలు పైగానే పలుకుతుంది. ఎవరైనా నిర్మాణం చేపట్టాలనుకుంటే ముడి సరుకుల ధరలు చూసి ఆలోచించుకుని నిర్మాణాలు చేసుకోవాల్సిందే. ప్రస్తుతం సీనరేజ్ వల్ల నిర్మాణ రంగంతో పాటు, రవాణా రంగంపై పెను భారం పడనుంది. ప్రభుత్వం పునారాలోచించి మినహాయింపు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

ఉల్లిని విడతల వారీగా మార్కెట్‌కు తరలించాలి

కోడుమూరు రూరల్: ఉల్లి దిగుబడులను ఒకేసారి గాకుండా విడతల వారీగా మార్కెట్‌కు తరలించేలా చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్, హార్టికల్చర్ ఆఫీసర్ మదన్‌మోహన్ సూచించారు. ఉల్లి సాగు, పంట నమోదుపై శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వారు రైతు సేవా కేంద్రాల సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. మండలంలో వర్షాధారంగా సాగు చేసిన ఉల్లి కోతలను రైతులు మొదులుపెట్టారని, రైతులంతా ఒకే సారి దిగుబడులను మార్కెట్‌కు తరలించకుండా విడతల వారీగా తరలించేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే పంటల నమోదు, రైతుల ఈకేవైసీని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో డ్రిప్ అవసరమైన రైతుల పేర్లను నమోదు చేయించాలన్నారు.

వాసవీ భవన్ ప్రారంభం

కల్లూరు: కల్లూరులోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ ఆవరణలో కల్లూరు వాసవీ సేవా ట్రస్ట్, కల్లూరు వాసవీ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ వెంకటేష్ వాసవీ భవన్‌ను రాష్ట్ర మంత్రి టీజీ భరత్ దంపతులు శుక్రవారం ప్రారంభించారు. ఈ భవనానికి సంబంధించిన శిలాఫలకాన్ని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పారిశ్రామికవేత్త టీజీ శివరాజ్, ఆర్యవైశ్య సంఘం ప్రముఖుడు ఇల్లూరు లక్ష్మయ్య, కల్లూరు వాసవీ సేవా ట్రస్ట్ చైర్మన్ చిలమకూరు రాజశేఖర్, వైస్ చైర్మన్ రామలింగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చెస్ పోటీలు

కల్లూరు: దూపాడు సమీపంలోని కేవీ సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో.. రాజవర్ధన్ రెడ్డి జయంతి సందర్భంగా నిర్వహించిన అంతర్జాతీయ చదరంగం పోటీలు ముగిశాయని కేడీసీసీబీ చైర్మన్, పోటీల ఆర్గనైజింగ్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే దస్తగిరి, మాజీ ఎమ్మెల్యే గఫూర్ హాజరై పోటీలను పరిశీలించారు. కళాశాల చైర్మన్ కేవీ సుబ్బారెడ్డి, కార్పొరేటర్ పద్మలత, నాగేశ్వర యాదవ్, చంద్రశేఖర్, ఐకాన్ చెస్ అకాడమీ చైర్మన్ శివరామిరెడ్డి, శ్రీలక్ష్మీ విద్యాసంస్థల డైరెక్టర్ కార్తీక్, శ్రావ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి


అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందిస్తున్న ఆర్‌పీఎస్ఎఫ్ నాయకులు

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీలో నిధుల దుర్వినియోగంపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్‌పీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వర్సిటీలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్‌యూ అవినీతి, అక్రమాలకు నిలయంగా మారిందని ఆరోపించారు. అవినీతి పరుడైన వ్యక్తిని రిజిస్ట్రార్‌గా అక్రమంగా కొనసాగించడం సిగ్గుచేటని ఆరోపించారు. అక్రమార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తూ ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఇష్టానుసారంగా ఎలాంటి టెండర్లు లేకుండా తమకు నచ్చిన వారికి కాంట్రాక్టులు ఇస్తూ కమీషన్లకు కక్కుర్తిపడి వర్సిటీ పరువును బజారు పాలు చేస్తున్నాడని మండిపడ్డారు. సెక్యూరిటీ ఏజెన్సీ టెండర్లలో నిబంధనలు పాటించలేదని, విద్యార్థుల ఫీజులతో నాన్‌టీచింగ్ ఉద్యోగులకు జీతాలు చెల్లించడంతో వర్సిటీ అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. రిజిస్ట్రార్ అవినీతి అక్రమాలపై వర్సిటీ వీసీకి ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ప్రస్తుత రిజిస్ట్రార్ హయాంలో వర్సిటీ నాల్గవ కాన్వొకేషన్ నిర్వహిస్తే అందులో భారీ మొత్తంలో అవినీతికి పాల్పడే అవకాశం ఉందన్నారు. విధుల నుంచి తొలగించిన ఆరుగురు టీచింగ్ ఫ్యాకల్టీని విధుల్లోకి తీసుకోక పోతే వర్సిటీ బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. నాయకులు శ్రీనాథ్, జగదీష్, జగన్, సందీప్, కౌశిక్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన రోడ్లతో ప్రజల అవస్థలు

కోడుమూరు రూరల్: మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో వీధి రోడ్లు అధ్వానంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రామక్రిష్ణ అన్నారు. శుక్రవారం ప్యాలకుర్తి గ్రామంలో సీపీఎం నాయకులు పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ప్యాలకుర్తి మీదుగా గూడూరుకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా ఉండటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని గ్రామస్తులు సీపీఎం నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా రామక్రిష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సమస్యలను గాలికొదిలేసిందని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లను బాగు చేయించాలన్నారు. రైతులు కష్టించి పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు గఫూర్‌మియ్యా, నాయకులు ఎర్ర మద్దిలేటి, లక్ష్మన్న పాల్గొన్నారు.


అధ్వానంగా ఉన్న రహదారిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

● ఆదిత్యుడికి సుంగధ ద్రవ్యాభిషేకం

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్వయుజ మాసం తులా సంక్రమణం పురస్కరించుకొని ఆదిత్యుడికి క్షీరాభిషేకం, సుంగధ ద్రవ్యాభిషేకం, అర్చనలు తదితర పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో సూర్యనారాయణ స్వామి

మోదీ పర్యటనతో ప్రజలకు ఒరిగిందేమీ లేదు

ఓర్వకల్లు: భారత ప్రధాని నరేంద్రమోదీ కర్నూలు జిల్లా పర్యటనతో ప్రజలకు ఒరిగిందేమీ లేదని సీపీఐ మండల కార్యదర్శి రమేష్ విమర్శించారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో రమేష్ మాట్లాడుతూ.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ నెల 16వ తేదీన ప్రధాని నరేంద్రమోదీ పర్యటనలో భాగంగా మండలంలోని నన్నూరు టోల్‌ప్లాజా సమీపంలో గల రాగమయూరిలో సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ పేరుతో నిర్వహించిన బహిరంగ సభకు భారీగా ప్రజలను తరలించడంతో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. అధికారులు ఆలోచనరహితంగా జన సమీకరణ చేయడంతో ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. దీంతో రూ.కోట్లాది నిధులు దుర్వినియోగమైనట్లు విమర్శించారు. వామపక్ష ఉద్యమకారులను అరెస్టు చేసి సభకు వెళ్లకుండా నిర్బంధం చేయడం దారుణమన్నారు. పార్లమెంట్ సాక్షిగా మోదీ ఇచ్చిన రాష్ట్ర విభజన హామీలను విస్మరించడం శోచనీయమన్నారు.


మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు రమేష్

మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రధాని పర్యటనకు వెళుతున్న తరుణంలో జనసేన పార్టీకి చెందిన యువకులు విద్యుత్ ప్రమాదానికి గురికాగా అందులో మునగాలపాడు గ్రామానికి చెందిన యువకుడు మృతి చెందడం విషాదకరమన్నారు. మరో ఇద్దరు యువకులు గాయపడినట్లు తెలిపారు. మృతి చెందిన యువకుడి కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గాయపడిన వారికి రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు. పార్టీ నాయకులు మహబూబ్‌బాష, ఏఐఎఫ్‌ఐ నాయకులు వలి తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

కర్నూలు కల్చరల్: భగవద్గీత పఠనంతో ఉత్తమ జీవన విధానం అలవడుతుందని కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక ప్రభు అన్నారు. శుక్రవారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో రమ ఏకాదశి పూజలు నిర్వహించారు. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితంలో ఉత్పన్నమయ్యే సమస్యలకు భగవద్గీతలో పరిష్కారం దొరుకుతుందన్నారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రాయల జయంతిని అధికారికంగా నిర్వహించాలి


శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు

కర్నూలు(అర్బన్): విజయనగర సామ్రాజ్యాధీశుడు శ్రీ కృష్ణ దేవరాయల జయంతి, పట్టాభిషేక మహోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నగర బలిజ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మన్న, రవికుమార్ కోరారు. శుక్రవారం రాయల 496వ వర్ధంతి సందర్భంగా సంఘం నేతలు ఆయన విగ్రహానికి గజమాలను వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలువలు తవ్వించి, దేవాలయాలు నిర్మించి తెలుగు నేలపై రాయలు విశేషమైన కార్యక్రమాలను చేపట్టారన్నారు. అలాగే తెలుగు భాష వైభవాన్ని పెంపొందించారని కొనియాడారు. నగరంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన కాపు భవన్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలన్నారు. కాపు కార్పొరేషన్‌కు తగినన్ని నిధులు విడుదల చేయాలన్నారు. కాపు నాడు రాష్ట్ర అధ్యక్షుడు ఆర్జా రామక్రిష్ణ, ప్రధాన సలహాదారు సింగంశెట్టి సోమశేఖర్, ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌కుమార్, కార్యవర్గ సభ్యులు ఓంకార్, ఆంజనేయులు, శ్రీనివాసులు, శోభన్‌బాబు, వెంకటేశ్వర్లు, గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం

కర్నూలు(అగ్రికల్చర్): ఈ నెల 16న ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ సభ వేదిక సమీపంలో విద్యుత్ షాక్‌తో మరణించిన ఎం.అర్జున్ కుటుంబానికి విద్యుత్ శాఖ రూ.5 లక్షల పరిహారం అందించింది. శుక్రవారం కర్నూలు మండలం మునగాలపాడు గ్రామానికి వెళ్లి రూ.5 లక్షల చెక్కును అర్జున్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్‌ఈ ప్రదీప్‌కుమార్ ఉన్నారు. అర్జున్ (15) అత్యుత్సాహం వల్లనే విద్యుత్ షాక్‌కు గురైనట్లు విద్యుత్ శాఖ ఎస్‌ఈ తెలిపారు. అవగాహన లేమితో ఫొటో షూట్ చేసే క్రమంలో 18 అడుగుల ఇనుప రాడ్డు కలిగిన జెండాను అటు, ఇటూ ఆడిస్తూ ముగ్గురు స్నేహితులతో బైక్‌పై నిలబడి సభా ప్రాంగణానికి వెళ్లేందుకు ప్రయత్నించారన్నారు. విద్యుత్ సిబ్బంది వారిస్తున్నా అలాగే వెళ్లి వేదికకు విద్యుత్ సరఫరా అందించే 11 కేవీ లైన్‌కు తగిలి ప్రమాదవశాత్తు మరణించారని ఎస్‌ఈ చెప్పారు. తమ తప్పేమీ లేదు.. ఆ బాలుడే అత్యుత్సాహంతో వ్యవహరించి విద్యుత్ షాక్‌కు గురయ్యారని పేర్కొనడం గమనార్హం. విద్యుత్ షాక్‌తో జనసేన కార్యకర్త మరణించినప్పటికీ ఆ పార్టీ అధ్యక్షుడి నుంచి కనీస సానుభూతి కూడా వ్యక్తం కాకపోవడం పట్ల పలువురు ఆవేదన చెందుతున్నారు.

అత్యవసరాలకు పరుగెత్తాల్సిందే!

- ప్రభుత్వ కార్యాలయాల వద్ద కానరాని మరుగుదొడ్లు
- కొరవడిన మౌలిక సదుపాయాలు
- వివిధ పనులపై వచ్చిన ప్రజలకు ఇక్కట్లు

గడివేముల: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు ఎంతోమంది ప్రజలు వివిధ పనులపై నిత్యం వస్తుంటారు. వారికి కనీస సదుపాయాలు కానరావడం లేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా ప్రభుత్వ కార్యాలయాల వద్ద మరుగుదొడ్లు లేక కుందూనది వైపు పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొంది. ఒకే చోట తహసీల్దార్, మండల పరిషత్, సచివాలయం-1, 2 కార్యాలయాలు, వ్యవసాయశాఖ, ఎన్‌ఆర్‌ఈజీఎస్, హౌసింగ్, పోలీస్‌స్టేషన్ కార్యాలయాలు ఉన్నాయి. కార్యాలయాలు పనిచేసే సమయంలో వివిధ పనులపై వచ్చే సామాన్యులతో పాటు ఎంపీటీసీ, సర్పంచ్‌లు, తదితరులతో ఆయా కార్యాలయాలు నిత్యం రద్దీగా ఉంటున్నాయి. గంటల కొద్దీ వేచి ఉండే వారికి నిలువ నీడ లేకుండా పోయింది. కనీసం మరుగుదొడ్లు లేక అవస్థలు పడుతున్నారు.


తహసీల్దార్ కార్యాలయం


ఎంపీడీఓ కార్యాలయం

తాగునీటికి అవస్థలు

వివిధ పనులపై కార్యాలయాలకు వచ్చే ప్రజలకు కనీసం తాగు నీటి సౌకర్యం ఏర్పాటు చేయలేదు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు, రైతులు, మహిళలు స్థానిక దుకాణాల్లో తాగునీటిని కొనుగోలు చేసుకుని తాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటిని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మరుగుదొడ్లు అధికారులకే...

ప్రభుత్వ కార్యాలయాలలో అధికారులకు మాత్రమే మరుగుదొడ్లు స్త్రీ, పురుషులకు వేర్వేరుగా ఉన్నాయి. వీటిని ప్రజలు వినియోగించుకునే అవకాశం లేదు. అధికారులు మాత్రమే వినియోగిస్తున్నారు. దాంతో ప్రజలు దూరప్రాంతాలకు, దగ్గరలో ఉన్న కుందూ వద్దకు బహిర్భూమికి పరుగులు తీస్తున్నారు. మహిళలు తమ బాధ ఎవరికీ చెప్పుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిషత్ కార్యాలయం మేడపైన సమావేశాలు నిర్వహించేటప్పుడు అక్కడికి వచ్చే జనం ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్యాలయాలకు వచ్చే ప్రజల కోసం మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సీనియర్ అసిస్టెంట్ మృతి

పాణ్యం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న తొగర్చేడు గ్రామానికి చెందిన కాచిరెడ్డి శ్రీనివాసరెడ్డి (57) అనారోగ్యంతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గత రెండు రోజుల నుంచి ఆరోగ్యం సహకరించకపోవడంతో నంద్యాలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతిచెందారు. ఆయన పాణ్యం తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ అందరికి సుపరిచితులుగా ఉండేవారు. ఆయన మృతి పట్ల రెవెన్యూ సిబ్బంది ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె సంతానం ఉన్నారు.

హైకోర్టు విషయంలో కూటమి పాత పాటే!

కర్నూలు(సెంట్రల్): కర్నూలులో హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేస్తామని కూటమి నాయకులు పాత పాటే పాడారని ఇలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సింగరాజు లక్ష్మణ్ శుక్రవారం ఓ ప్రకటనలో విమర్శించారు. 15 ఏళ్లుగా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నా కర్నూలులో హైకోర్టు లేదా బెంచ్‌ను ఏర్పాటు చేయలేదన్నారు. 2014 ఎన్నికల్లో గెలిపిస్తే వెంటనే బెంచ్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పి మాట తప్పారని విమర్శించారు. 2025 ఎన్నికల్లో గెలిచి 16 నెలలు అవుతున్నా ఎందుకు హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నించారు. ఎప్పుడు ఏర్పాటు చేస్తారో చెప్పాలని సూటిగా ప్రశ్నించారు.